సంస్కృత కళాశాలలకు పూర్వవైభవం చేకూర్చాలి

విశాలాంధ్ర-గుంటూరు : నానాటికి అంతరించిపోతున్న సంస్కృత కళాశాలలకు పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలంటూ గుంటూరులోని ప్రభుత్వ పెన్షనర్ల హాల్‌లో ఆదివారం జరిగిన పొన్నూరు శ్రీ భావన్నారాయణ స్వామి సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం విజ్ఞప్తి చేసింది. స్నేహితుల దినోత్సవం సందర్భంగా కళాశాలలో 1962-83 మధ్య చదివిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో కలిశారు. తెలుగు భాష, సాంస్కృతి ద్వారానే ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతి సుసాధ్యం కాగలదన్నారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థిని, తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి, విశ్రాంత ప్రిన్సిపాల్ తాళ్ళూరి ఆంజనేయులు, వివిధ హోదాలలో పనిచేసిన కె.పద్మేశ్వరరావు, గాంధీ, వెంకట్రావు, శివరామకృష్ణ, దావులూరి రాజేంద్రప్రసాద్, పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, ఎం.కృష్ణ కిషోర్, నిమ్మరాజు శ్రీనివాస మూర్తి, పీబీడీవీ ప్రసాద్, నారాయణం రాంబాబు, సీనియర్ జర్నలిస్ట్, తిమ్మసముద్రం శ్రీ గోరంట్ల వెంకన్న సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థుల సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు నిమ్మరాజు చలపతిరావు పాల్గొన్నారు.

గద్దర్ సేవలు చారిత్రాత్మకం

విశాలాంధ్ర-గుంటూరు : ప్రజా సాంస్కృతిక ఉద్యమానికి గద్దర్ చేసిన కృషి చారిత్రాత్మకమైందని అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. గద్దర్ మృతికి ఆయన ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఇటీవల కాలంలో గద్దర్ విభిన్నమైన విచిత్రమైన పోకడలు పోయారని, కాంగ్రెస్ పార్టీకి దగ్గర అవటం కూడా చూశామని, తొలిగా వారు ఎంచుకున్న విప్లవ మార్గం నుంచి గద్దర్ వైదొలగటం జరిగిందనేది వాస్తవమని అన్నారు. అయితే విరసంలో ఉంటూ విప్లవోద్యమం ముందుకు సాగటానికి గద్దర్ చేసిన కృషి అపూర్వమని అన్నారు. ప్రగతిశీల సాంస్కృతిక ఉద్యమానికి గద్దర్ చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ వారికి జోహార్లు అర్పిస్తున్నానని అన్నారు.

యాచకులకు భోజన ప్యాకెట్ల అందజేత

విశాలాంధ్ర-మంగళగిరి : ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం దగ్గర యాచకులకు భోజన ప్యాకెట్లను అందజేశారు. ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ యార్లగడ్డ శివ గోపి, కో కన్వీనర్ అభిషేక్, ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు ఆళ్ళమూడి హనోక్ బాబు, దాసరి అజయ్, సీపీఐ సీనియర్ నాయకులు గోహార్ జానీ పాల్గొన్నారు.

గ్రామ నిధులు దారిమళ్లిస్తున్న ప్రభుత్వం

విశాలాంధ్ర-తుళ్లూరు : కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు కేటాయించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లీస్తుందని బీజేపీ తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య ఒక ప్రకటనలో అన్నారు. పంచాయతీల ద్వారా జరగవలసిన అభివృద్ధి పనులను గాలికి వదిలేసి గ్రామ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను దుర్వినియోగపరుస్తు న్నందుకు ఈ నెల 10వ తేదిన గుంటూరులో బీజేపీ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాడికొండ నియోజకవర్గంలోని సర్పంచులు, వార్డు నెంబర్లు పాల్గొనాలని కోరారు.

ప్రజారోగ్యమే ధ్యేయం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నేటి ఆధునిక యుగంలో పేదల ఆరోగ్యమే తమ ధ్యేయమని కోస్టల్ కేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కె. మురళీ పేర్కొన్నారు. ఏటుకూరులో ఆదివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్వర్ణముఖి ఫౌండేషన్, కోస్టల్ కేర్ హాస్పిటల్ సౌజన్యంతో తన్నీరు లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 150 మందికి ఈసీజీ, బీపీ, షుగర్, కంటి పరీక్షలు, దంత పరీక్షలతో పాటు రక్త పరీక్షలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా కోస్టల్ కేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కె.మురళీకి, తన్నీరు లక్ష్మణ్ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కోస్టల్ కేర్ హాస్పిటల్ డాక్టర్ శివ ప్రసాద్, డాక్టర్ సాయి కృష్ణ, డాక్టర్ వరికల్లు దివ్య, డాక్టర్ చిలకా కోటేశ్వరరావు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయాల్లో మహిళలు చురుకైన పాత్ర వహించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: మహిళలు రాజకీయాలలో చురుకైన పాత్ర వహిస్తేనే దేశంలోని మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని భారత రాష్ట్ర సమితి నాయకులు షేక్ ఖాజావలి అన్నారు. రాష్ట్ర పార్టీ కార్యాలయంలో గుంటూరు నగరానికి చెందిన మహిళా పారిశ్రామికవేత్త మహమ్మద్ ఫర్హానా బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంలో ఖాజావలి మాట్లాడారు. బీఆర్ఎస్ దేశంలో నానాటికి బలపడుతుందని ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర అధ్యక్షులు తోట చంద్రశేఖర రావు ఆశయాల కనుగుణంగా పార్టీని విస్తరింప చేస్తున్నామని అన్నారు. మహమ్మద్ ఫర్హానా మాట్లాడుతూ ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షులు చంద్రశేఖర రావు ఆదేశాల మేరకు పార్టీలో క్రియాశీలక పాత్ర పోషిస్తామని, మహిళలను పార్టీలో చేర్పించడానికి కృషి చేస్తానని తెలియజేశారు. షేక్ కుదిరి, షేక్ మహబూబ్, షేక్ సిరాజ్, షేక్ షాకీర్ పాల్గొన్నారు.

యోగాసన విజేతలకు బహుమతులు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సుమేధ హైస్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి యోగాసన పోటీలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా ఇంటెలిజెన్స్ డీఎస్పీ గోలి లక్ష్మయ్య, స్థానిక కార్పొరేటర్ పదాల సుబ్బారెడ్డి, సుమేధ హైస్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి విచ్చేసి పోటీలను ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలలో పాల్గొన్న వారందరికీ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి డిక్షనరీలను అందజేశారు. స్థాయిలో గెలుపొందిన విజేతలు రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలకు అర్హత సాధించారని, వీరు రాష్ట్ర స్థాయిలో కూడా మంచి ప్రదర్శన కనపరచి జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని అసోసియేషన్ అధ్యక్షులు ఆళ్ళ రాజేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి మల్లిఖార్జునరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మోగా గురువులు తేజస్వి, బి.సురేష్, సి.విష్ణువర్ధన్ రెడ్డి, ఎ.సుజాత మొదలగు వారి పాల్గొని న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆదివారం గుంటూరు దళిత బహుజన ఫ్రంట్ కార్యలయంలో ప్రజా గాయకుడు గద్దర్ అకాల మరణానికి దళిత బహుజన ప్రజాసంఘాలు నివాళులర్పించారు. మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గద్దర్ 5 దశాబ్దాలుగా ప్రజా ఉద్యమాలకు తన పాట ద్వారా ప్రజా ఉద్యమాలకు ప్రేరణా శక్తిగా, ప్రజా యుద్ధనౌకగా పీడిత ప్రజల పక్షాన నిలబడిన సంస్కృతిక యోడుదని కొనియాడారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జాతియ్య అధ్యక్షులు కొరివి వినయకుమార్, ప్రముక సేనియర్ న్యాయవధి వైకే, డాక్టర్ ఉన్నం సుధాకర్, సునీల్ కుమార్, దేవాసోత్ చంద్రా నాయక్, మార్పుడి సూరిబాబు, సుద్దపల్లి వసంత కుమార్, పవన్ కుమార్, గద్దంపాల్ విజయ కుమార్ తదితరులు నివాళులర్పించారు.

మోదీని సాగనంపేందుకు లౌకిక శక్తులు ఏకం కావాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల

విశాలాంధ్ర-గుంటూరు : నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని 2024లో ఇంటికి సాగనంపాలంటే లౌకికశక్తులు, కమ్యూనిస్టులు, మేధావులు, కార్మికులు, రైతులు, అన్ని వర్గాల ప్రజలు ఏకం కావాల్సిన అవసరం ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. పొన్నూరు నియోజకవర్గ సీపీఐ సమితి సమావేశం గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో కొల్లి రంగారెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, బీజేపీ రెండవ దఫా అధికారంలోకి వచ్చిన మొదలు మత ఉన్మాదం పేట్రేగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు, దళితులు, గిరిజనులు, ముస్లిం మైనార్టీలపై దాడులు యథేచ్ఛగా జరుగుతున్నాయని అన్నారు. మణిపూర్‌లో అగ్రకుల మతోన్మాదుల దాడులు పెరిగిపోయాయని, మహిళలను నగ్నంగా వీధుల్లో తిప్పి అత్యాచారాలు చేసి అమానుషంగా మహిళల ప్రాణాలు తీస్తున్నారన్నారు. ఆదివాసీలు గిరిజన ప్రాంతవాసులను కొండ ప్రాంతంలో నివసిస్తున్న అణగారిన వర్గాల వారిని నిర్దాక్షంగా ఖాళీ చేయించాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందన్నారు. కొండ ప్రాంతంలో ఉన్న నిధి నిక్షేపాలతో పాటు మైనింగ్‌లను బడా పారిశ్రామికవేత్తలైన ఆదాని, అంబానీలకు అప్పనంగా కట్టబెట్టే కుట్ర జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ప్రధాని మోదీ ఏ మాత్రం నోరు మెదపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ(బుజ్జి) మాట్లాడుతూ ఈ నెల 8న విజయవాడలో ధర్నా చౌక్‌లో జరిగే రైతు ధర్నాలో నియోజకవర్గ రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. అలాగే క్విట్ ఇండియా డే సందర్భంగా 9వ తేదీన జరిగే కార్మిక సంఘాల మహా పడావో కార్యక్రమంలో కార్మికులందరూ విజయవాడ ధర్నా చౌక్ వద్దకు చేరి క్విట్ మోదీ సేవ్ ఇండియా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గత సమావేశం నుంచి నియోజకవర్గంలో నిర్వహించిన పార్టీ కార్యకలాపాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా సమాఖ్య సభ్యులు రెంటాల కుమారి, రమణ, సీహెచ్ విజయలక్ష్మి, కూసం నాగిరెడ్డి, వి.సీతారామయ్య, మండే రవీంద్ర, ఆర్.బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి చలో విజయవాడ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-తాడి కొండ : తెలంగాణ మాదిరిగా ప్రతి రైతుకు రూ.10 వేలు సాగు సహాయం అందించాలని కోరుతూ సోమవారం విజయవాడ నగరంలో జరుగుతున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చల శివాజీ కోరారు. పొన్నెకల్లు సీపీఐ కార్యాలయంలో ఆదివారం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. రెండు ఎకరాలు సాగు చేస్తున్న రైతు, కౌలు రైతుకు సాగు సాయం కింద రూ.20 వేలు అందజేయాలన్నారు. 90 శాతం సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను అందజేయాలని విజ్ఞప్తి చేశారు. స్వామినాథన్ కమీషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకరరావు, రామినేని నరసింహారావు, ముప్పాళ్ళ ఉమామహేశ్వరరావు, పాలేటి లక్ష్మీనారాయణ, రామినేని నాని పాల్గొన్నారు.

టీడీపీ సీటు మాదిగలకు కేటాయించాలి

విశాలాంధ్ర-తాడికొండ : వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో తాడికొండ టీడీపీ సీటును మాదిగలకు కేటాయించాలని మాజీ సర్పంచ్ నూతక్కి నవీన్ కుమార్ అధిష్టానాన్ని కోరారు. నియోజవర్గ కేంద్రమైన తాడికొండ మాదిగ పల్లెలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1979 నుంచి తాడికొండ ఎస్సీ నియోజకవర్గంగా ఉందన్నారు. 1983లో టీడీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. నాటినుంచి నేటి వరకు తాడికొండ సీటును మాలలకు కేటాయించి మాదిగలను నిర్లక్ష్యం చేస్తుందన్నారు. మాదిగ ఓటర్లు అధికంగా ఉన్న టీడీపీ ప్రభుత్వం తమను చిన్నచూపు చూస్తుందని మండిపడ్డారు. టీడీపీ అధినాయకత్వం తమ తీరును మార్చుకోవాలని హెచ్చరించారు. గడచిన 40 సంవత్సరాలుగా తాడకొండ సీటును మాలలకు ఇస్తూ తమకు అన్యాయం చేస్తుందని విమర్శించారు. జిల్లాలో ఈసారి రెండు స్థానాలు మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అధినాయకత్వం నిర్లక్ష్యం వహిస్తే పతనం తప్పదని హెచ్చరించారు. టీడీపీ నాయకులు మేకల అనిల్, నూతక్కి దేవదాసు, కొలికెపూడి బుల్లయ్య, ఆరుమళ్ళ పూర్ణచందు, పల్లెవాసులు పాల్గొన్నారు.

చలో విజయవాడ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-గుంటూరు : 'క్విట్ మోదీ-సేవ్ ఇండియా' పేరుతో ఈ నెల 9వ తేదిన తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి కోట మాల్యాద్రి పిలుపునిచ్చారు. బుడంపాడు శానిటరీ కార్యాలయం వద్ద ఆదివారం కార్మికులతో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తుంగలోతొక్కి 4 లేబర్ కోడ్‌లను తీసుకువస్తుందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్‌లకు కట్టబెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలలో నరేంద్ర మోదీని గద్దెదించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విజయవాడలో చేపట్టిన కార్యక్రమంలో గుంటూరు నగరంలోని కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు ఏసుదాసు, పరమేశ్వరి, వెంకటేశ్వరరావు, లక్ష్మి, శీను తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-ఫిరంగిపురం: ఫిరంగిపురం-మేడికొండూరు మండలాల ముస్లీం సోదరులు ఐక్యంగా మేడికొండూరు మండలంలోని పేరేచర్ల సమీపంలో రవీంద్ర హోటల్ గ్రౌండ్‌లో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ర్యాలీగా బైక్‌లపై ఫిరంగిపురం నుంచి పేరేచర్ల రవీంద్ర హోటల్ వరకు పెద్ద సంఖ్యలో ముస్లీం సోదరులు తరలి ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమం నిర్వాహకులు ఫిరంగిపురం మండలం వేములూరిపాడు గ్రామానికి చెందిన ప్రముఖ నాయకులు సయ్యద్ హబీబుల్లా, మునగపాడు గ్రామానికి చెందినషేక్ ఖాలేషావలి(రైస్‌మిల్ బాబు) ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తాడికొండ ముస్లీం సోదరులంతా ఐక్యంగా అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ముఖ్య ఉద్దేశ్యమన్నారు. గెలుపోటములు శాసించే శక్తి ఉన్నా రాజకీయ పార్టీలు ముస్లీంలను గుర్తించడంలేదన్నారు. ముస్లీంలందరు ఐక్యంగా సంఘంగా ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి పేద ముస్లీం కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేలా, సమస్యలను సంఘం తరుపున పరిష్కరించేందుకు ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వ పథకాలను రూపొందించుకోవాలని ఈ సమ్మేళన కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. గఫార్, సుభానీ, నత్తార్, గౌస్, మీరా, సుభానీ తదితర నాయకులతోపాటు ముస్లీం సోదరులు పెద్ద సంఖ్యలో ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు : ప్రజా కళాకారుడు, ప్రజా విప్లవ గాయకుడు గద్దర్ మృతికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. వారి కుటుంబానికి సానుభూతిని వ్యక్తం చేశారు. హైదరాబాద్ అపోలో హాస్పటల్లో చికిత్స చేయించుకుంటూ అనారోగ్య కారణాల వలన ఆయన మృతి చెందడం ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర ప్రజానీకం, అనేక రాష్ట్రాల్లో వామపక్ష ఉద్యమాభిలాషులు, శ్రేణులకు తీరనిలోటని అన్నారు. ఒక ప్రజా కళాకారునిగా ప్రజల కోసం గళం విప్పిన వీరుని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై ఉన్నతమైన ప్రజా గేయాలను పాడిన ఒక అమర గాయకునిగా గద్దర్ పేరు చిరకాలం నిలిచిపోతుందన్నారు. దేశంలో కుల, మత వర్గరహిత సమసమాజ నిర్మాణం కోసం పాటుపడుతూ పేద, ధనిక వర్గాల తేడాలు లేని సమాజం కోసం పేద దళిత, బలహీన, మైనారిటీ వర్గాల సాంఘిక సామాజిక న్యాయం కోసం పోరాటాలు చేస్తున్న వామపక్ష శ్రేణులను తన గాత్రంతో ఉత్సాహపరుస్తూ, ప్రజలను ఉత్తేజపరుస్తూ సాయుధ పోరాటాలకు సన్నద్ధం చేసిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర వెలకట్టలేనిదని అన్నారు.

గద్దర్ మృతికి సంతాపం

విశాలాంధ్ర-గుంటూరు : ప్రజా విప్లవ గాయకుడు, ప్రజా కళాకారుడు గద్దర్ మృతికి డీసీసీ అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు ఒక ప్రకటనలో సంతాపం తెలిపి వారి కుటుంబానికి తన సానుభూతిని తెలియజేశారు. ఆయన మృతి తీరని లోటని అన్నారు. నేటితో ప్రజా గళం మూగబోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

గద్దర్‌కు సీపీఐ, ప్రజానాట్యమండలి నివాళి

విశాలాంధ్ర-మంగళగిరి: ప్రజా గాయకుడు, నటుడు రచయిత, తెలంగాణ ఉద్యమంలో తన పాటలతో ఎంతోమందిని పోరాటంలో పాల్గొనేటట్లు చేసిన ఉత్తమ ప్రజా గాయకుడు నంది అవార్డు గ్రహీత గద్దర్ మరణం దేశానికి తీరని లోటని ప్రజానాట్యమండలి నియోజకవర్గ కార్యదర్శి కంచర్ల కాశయ్య అన్నారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో ఆదివారం గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గొప్ప ప్రజా గాయకుడిని కోల్పోవడం తీరనిలోటని కంచర్ల కాశయ్య అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రజా గాయకుడు గద్దర్ పాటలు విప్లవాత్మకంగా ఎంతో మందిని ఉత్తేజపరిచే విధంగా ఉండేవని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య కొనియాడారు. ఈ కార్యక్రమంలో జాలాది జాన్ బాబు, దారా గురునాథం గొహర జానీ, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ శివ గోపి, కొకన్వీనర్ అభిషేక్, పట్టణ అధ్యక్షుడు ఆళ్ళమూడి హనోక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా విప్లవ జ్యోతి గద్దర్‌కు ఘన నివాళి

విశాలాంధ్ర-పొన్నూరు : విప్లవ కవి, నటుడు, ప్రజా గాయకుడు గద్దర్ అకాల మరణాన్ని చింతిస్తూ ఆయన చేసిన ప్రజాసేవను గుర్తు చేసుకుంటూ ఆదివారం పొన్నూరు అంబేద్కర్ సెంటర్లో ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్య వాదులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ప్రజా సేవలో గద్దర్ చేసిన విప్లవ పోరాటాలను గుర్తుచేశారు.

భూముల పంపిణీలో వ్యవసాయ కార్మిక సంఘం కృషి: సీపీఐ

విశాలాంధ్ర-దుగ్గిరాల : భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నీడలేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు, సాగు భూములు పంపిణీ చేయడంలో వ్యవసాయ కార్మిక సంఘం ఎంతో కృషి చేసిందని సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అన్నారు. దుగ్గిరాల రైలుపేటలో పసుపు అసోసియేషన్ హాల్ వద్ద ఆదివారం 22వ వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ జరిగింది. మహాసభకు మంచా గిరి స్వాగతం పలికారు. అనంతరం మహాసభ యార్లగడ్డ శివయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ గ్రామీణ సమస్యలపై పోరాటాలు చేసి పార్లమెంట్‌లో పనికి ఆహార పథకాన్ని తీసుకొచ్చిన ఘనత వ్యవసాయ కార్మిక సంఘానికి దక్కుతుందని అన్నారు. ప్రతి ఒక్క వ్యవసాయ కార్మికుడికి రెండు ఎకరాల భూమిని కేటాయించాలని, 50 సంవత్సరాలు నిండిన వ్యవసాయ కార్మికుడికి పింఛను కూడా ఇవ్వాలని నేడు వ్యవసాయ కార్మిక సంఘం కోరుతుందని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు మాట్లాడుతూ పాలేరుల సంఘం నుంచి ప్రారంభమై తరువాత వ్యవసాయ కార్మిక సంఘంగా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. గ్రామీణ పేదల శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా సామాజిక న్యాయం కోసం 83 సంవత్సరాల క్రితం వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పడిందని గుర్తుచేశారు. ముందుగా వ్యవసాయ కార్మిక సంఘం జెండాను నూతక్కి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. జాలాది జాన్ బాబు, చిన్ని సత్యనారాయణ, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, జవ్వాది సాంబశివరావు, తుడుమెళ్ళ వెంకటయ్య, గోహార్ జానీ, దాసు, శ్రీను ఎస్‌కే కరీముల్లా, ధారా గురునాథం, ఎస్‌కే మదీనా, పంతగానీ మరియదాసు, జాలాది నవీన్, శివ గోపి, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

రుణ మేళా సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో ఈ నెల 8వ తేదీన జరిగే పీఎం స్వనిధి రుణ మేళాను చిరువ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని నాస్వి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ దూపాటి వెంకటరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వెండింగ్ కార్డు, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకంతో మేళాకు హాజరుకావాలని కోరారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

ప్రాజెక్టులపై బాబు యాత్రలు విడ్డూరం

విశాలాంధ్ర-తాడేపల్లి : చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా నీటి ప్రాజెక్టులపై యాత్ర చేయడం విడ్డూరంగా ఉందని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు విమర్శించారు. ఆదివారం తన కార్యాలయంలో మాట్లాడుతూ 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండి చంద్రబాబు ఒక్క ప్రాజెక్ట్ అయినా నిర్మించారా అని ప్రశ్నించారు. రాయసీమను రతనాల సీమగా మార్చడానికి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని అన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ చేస్తున్న యాత్రలు డ్రామలని విమర్శించారు. పుంగనూరులో టీడీపీ కార్యకర్తలతో దాడి చేయించి పైశాచిక ఆనందం పొందుతుంది మీరు కాదా అని ప్రశ్నించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్తూరు జిల్లాలో ఒక గుర్తింపు ఉన్న నాయకుడని అన్నారు. పేదల్లో చిరునవ్వు చూడాలని సీఎం జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమాలు ప్రవేశపెట్టారని అన్నారు. కుప్పంలో జరిగిన అల్లర్లకు పూర్తి బాధ్యత చంద్రబాబునాయుడిదేనని అన్నారు. ఇప్పటికైనా కుటిలమైన రాజకీయాలు మానుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

సామాన్య ప్రజలకు కార్పొరేట్ వైద్యం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : సామాన్య ప్రజలకు కార్పొరేట్ వైద్యం చేరువ కావాలనే ఉద్దేశ్యంతో హోప్‌విన్ హాస్పిటల్‌లో రూ.10 ఓపీ ఫీజుతో ఆత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నట్లు హాస్పిటల్ ఫౌండర్, జనరల్ అండ్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్ తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక అరుంధతి నగర్ 5వ లైనులో యువ నారీస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 350 మంది పేషంట్లకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ నజీరుద్దీన్ మాట్లాడుతూ రక్త పరీక్షలలో 50శాతం రాయితీ ఇవ్వనున్నట్లు, అతి తక్కువ ఖర్చుతో అన్ని రకాల జబ్బులకు శస్త్ర చికిత్సలు చేస్తారని అన్నారు. అవసరమైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తాన, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ బషీరుద్దీన్, ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ రాహుల్‌రెడ్డి, హాస్పిటల్ మేనేజర్ పి.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంతి రేఖలా వెలుగుపంచే వాడు 'స్నేహితుడు'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కారు చీకట్లు మూసుకున్న వేళ కాంతి రేఖలా వెలుగు పంచే వాడు ఫ్రెండ్ అని రాడికల్ హ్యూమనిస్ట్, ఫ్రెండ్స్ ఫోరం కన్వీనర్ కె.చంద్రశేఖరరావు అన్నారు. కడగండ్ల జీవితంలో మోముపై చిరునవ్వుకి కారణమయ్యే వాడు స్నేహితుడని పేర్కొన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'ఫ్రెండ్‌షిప్'దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ జీవి తాంతం తమ ఫ్రెండ్‌షిప్ కొనసాగుతుందని ప్రతినబూనారు. చంద్రశేఖర రావు మాట్లాడుతూ ఆస్తుల్లేని యువత ఉండొచ్చుకానీ దోస్తుల్లేని వారు అరుదని, కాలాలెన్ని మారినా కలకాలం నిలిచి ఉండే ఆ భావోద్వేగం వర్ణించటానికి కవితలు చాలవన్నారు. ప్రకృతి జీవన విధాన ప్రచారకులు వీవీ రావ్ మాట్లాడుతూ జీవితంలో ఎంతమంది మిత్రులున్నా స్నేహాన్వేషకులకు తృప్తి ఉండదని స్పష్టంచేశారు. ప్రొఫెసర్ రత్నరావు మాట్లాడుతూ కొంతమంది మిత్రులతో స్నేహం మనలో ఉన్నత భావాలు పెంపొందింపజేస్తాయని, మనలో మానవత్వం పరిమళిస్తుందన్నారు. ఈ వేడుకల్లో కొండా శివరామిరెడ్డి, చలమారెడ్డి, వెంకటరావు, తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

విశాలాంధ్ర-మంగళగిరి : నగరంలోని టీటీడీ కళ్యాణ మండపం ఎదుట ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎలాంటి కంచె ఏర్పాటు చేయకపోవడంతో సమీపంలోకి ఎవరు వెళ్లిన విద్యుత్ ఘాతానికి గురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా టీటీడీ కళ్యాణ మండపంలో జరిగే శుభకార్యాలకు సమీపంలోని పేద పిల్లలు సైతం భోజనాలు చేసేందుకు వస్తుంటారు. గమనించిన శుభకార్యాల నిర్వాహకులు వారిని వెంబడించే క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వెనుకకు వెళ్లి దాక్కుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు దాని చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు. విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ కుట్రలను ఎండగట్టాలి

విశాలాంధ్ర-తెనాలి : కేంద్రప్రభుత్వం మోడీ కుట్రలను ఎండగట్టాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు గురుబ్రహ్మం పిలుపునిచ్చారు. ఆదివారం తెనాలి పట్టణం, గంగానమ్మపేట, ఐతానగర్‌లో క్విట్‌ఇండియా కార్యక్రమం సందర్భంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. గురుబ్రహ్మం మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను మోడి ప్రభుత్వం నిర్వహిస్తుందని వారికి తగిన బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కారు చౌకగా అమ్మివేయడాన్ని తీవ్రంగా ఖండించారు. లాభాలతో వున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడాన్ని నిరసిస్తున్నామన్నారు. విజయవాడలో 9వ తేదీ జరిగే మహాశ్రామిక మహాగర్జనను కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఏఐటీయూసీ నాయకులు బొల్లిముంత కృష్ణ, పరుచూరి వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, కోటిరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు

- చోద్యం చూస్తున్న అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- తూతూమంత్రంగా తనిఖీలు
- స్థానికుల ఆగ్రహం

మట్టిని తవ్వుతున్న పొక్లెయిన్

విశాలాంధ్ర-చేబ్రోలు: అసైన్డ్ భూములు, అక్రమ క్వారీల తవ్వకాలకు చేబ్రోలు మండలం అడ్డగా మారింది. అసైన్డ్ భూముల్లో అక్రమంగా తవ్వకాలు నిర్వహిస్తున్న వారిని అరికట్టటంలో మైనింగ్,విజులైన్స్, రెవిన్యూ అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని స్థానికులు వాపోతునన్నారు. మండల పరిధిలోని వీరనాయకునిపాలెం, శేకూరు, శలపాడు గ్రామాల్లో ధనార్జనే ధ్యేయంగా అక్రమ క్వారీలు జరుగుతున్నాయని స్థానికులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. కొందరు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్న క్వారీ నిర్వహకులు ఇష్టారాజ్యంగా గ్రావేల్‌ను తవ్వకుంటు అడ్డువచ్చిన వారిని భయపెడుతు, పచ్చని పంట పొలాలను గుంతలుగా మార్చేస్తున్నారు. దీంతో పర్యవరణం పూర్తిగా దెబ్బ తింటుందని ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ, మైనింగ్ అధికారుల పనితీరు ఇలా..

గ్రావేల్ తవ్వకాలకు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోని, రైల్వే, ప్రభుత్వ , అసైన్డ్ భూములు కూడా తవ్వకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్న క్వారీలలో పగటి పూట, ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో రాత్రి సమయంలో అక్రమ క్వారీలు జరిపి లక్షల రూపాయలు ప్రభుత్వ ధనాన్ని నిలువున దోపిడీ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అక్రమ గ్రావేల్ తవ్వకాలపై స్థానికులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మైనింగ్ అధికారులు అసలు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు

గ్రామాల్లో జరుగుతున్న అక్రమ తవ్వకాలపై స్థానికులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయటంతో విజులైన్స్ మైనింగ్ అధికారులు తనికీలు చేయుటకు వచ్చి కారులో నుంచి కిందకు కూడా దిగకపోవటంతో స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తనికీలకు వచ్చిన అధికా రులు కనీసం కారు కూడా దిగకుండా తనికీలు చేసినట్లు నమోదు చేసుకోని వెళ్లుతున్నరని దానితో అడ్డుకున్నామని స్థానిక టీడీపీ నాయకులు పేర్కొంటున్నారు. భారీ లారీలతో గ్రావేల్ తరలించటం వలన రోడ్డు పూర్తిగా దెబ్బతిని ఆయా గ్రామాలకు ప్రయాణం సాగించుటకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. తనికీలకు వచ్చిన అధికారులు కూడా సక్రమంగా పని చేయకపోవటంతో గ్రామస్తులు, ప్రతిపక్షపార్టీ నాయకులు ప్రభుత్వంపై తీవ్రంగా మండి పడుతున్నారు. అధికారులు పనిచేయకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. అధికారులు చట్టాలను కాపాడాలని కానీ ఇక్కడ పార్టీ నాయకుల కోసం పని చేస్తునట్లు ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మైనింగ్ అధికారులను అడ్డుకున్న స్థానికులు

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

బాల ఆదిత్య స్కూల్లో వైద్య శిబిరం

విశాలాంధ్ర-రాజుపాలెం : మండల పరిధిలోని చౌటపాపాయపాలెం గ్రామం హైవే రహదారి పక్కన ఉన్న బాల ఆదిత్య స్కూల్‌లో కరస్పాం డెంట్ డాక్టర్ సామా నాయక్ సారథ్యంలో తన తల్లి భూక్యా సోని బాయి జ్ఞాపకార్థంగా గుంటూరు అంజలి మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. బీపీ, షుగర్, గుండె, ఊపిరితిత్తులు, జనరల్ మెడిసిన్, స్త్రీల వ్యాధులకు వైద్యులు పరీక్షించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.నాగరాజు, జనరల్ మెడిసిన్, కార్డియాలజిస్ట్ డాక్టర్ బి.దుర్గాప్రసాద్, పల్మలాజిస్ట్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తీర్థయాత్రికులకు శుభవార్త

విశాలాంధ్ర-వినుకొండ: ఈనెల 31న అనగా మహాపౌర్ణమి గురువారం సుప్రసిద్ద అరుణాచలం స్వామి వారి దర్శనం, గిరిప్రదక్షిణం చేసుకొను మహా అవకాశం కొరకు వినుకొండ డిపో మేనేజర్ బి.కోటేశ్వర నాయక్ ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 29వ తేది సాయంత్రం 9గంలకు బయల్దేరి 30వ తేది ఉదయం శ్రీకాళహస్తి మధ్యాహ్నం 12గంటలకు కాణిపాకం వినాయక దర్శనం, సాయంత్రం 6గంటలకు శ్రీపురం గోల్డెన్ టెంపుల్, ఆగస్టు 31ఉదయం 5గంటలకు అరుణాచలం దర్శనం కొరకు చేరుకొని... తిరిగి సెప్టెంబర్ 1వ తేది ఉదయం 4గంటలకు వినుకొండ చేరుకుంటారు. భక్తులు ఈ అవకాశాన్ని సదివినియోగించుకో వాలని, టిక్కెట్ ధర ఒక్కొక్కరికి రూ.2550 నిర్ణయించామని, ముందస్తుగా రిజర్వేషన్ సదుపాయం కలదని ఆయన తెలిపారు. వివరాల కొరకు 7382895527,7382898320 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

అన్నదాన గోడప్రతుల ఆవిష్కరణ

విశాలాంధ్ర-వినుకొండ: కాశి నాయన ఆశ్రమ కమిటీ వారు నూతనంగా వినుకొండ కొండపై ఉచిత అన్నదాన కార్యక్రమం నెలకొల్పుటకు కొండపైన శ్రీ రామలింగేశ్వర స్వామి దూత కాశినాయన నిత్య అన్నదాన సేవా సంస్థ నెలకొల్పుతున్నట్లు కమిటీ వారు తెలిపారు. ఆశ్రమ నిర్వాహకులు కాంతారావు ఆధ్వర్యంలో ఆవరణలో గోడ ప్రతులను ఆవిష్కరించారు. గుంటూరు అమ్మ ట్రస్ట్ స్వామి బాబా నంద్యాల రామచంద్ర నాయన వారి ఆశీస్సులతో కమిటీ ఏర్పాటైనది. ఈ కార్యక్రమానికి యస్.రామిరెడ్డి, బి. వెంకటరెడ్డి, కూచిపూడి సుబ్బారావు, సిహెచ్. ఆంజనేయ రెడ్డి, సూరారామిరెడ్డి,బి. రమేష్ బాబు,యస్. గురునాథం,యం. రాముడు బి. కృష్ణారెడ్డి, జి. రాజు,యస్. బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చర్చి నూతన పాలకవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-వినుకొండ: ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి నూతన పాలక వర్గ ఎన్నిక ఆదివారం ఆరాధనలో ఏకగ్రీవంగా సంఘం అంతా కలిసి ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా సురభి జోసఫ్ కుమార్, కార్యదర్శిగా బేతం గాబ్రియల్ మోజెస్, కోశాధికారిగా నేలపట్ల శ్యామ్ వరప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా కాల్వ సుందర రాజు, వైస్ సెక్రటరీగా పందుల న్యూటన్ ప్రసంగిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీని సంఘ కాపరి పత్రా ఫిలిప్ వారికి ప్రతిష్ట ప్రార్థనలు చేశారు. అనంతరం సంఘ పెద్దలు బేతం శ్యాంప్రసాద్, చాట్ల రామయ్య, గద్దల ఆశీర్వాద ప్రసాద్ వందనం, గద్దల ప్రేమ్ నాథ్ ప్రకాష్, పందుల ఫిలిప్, పులుగుజ్జు ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ బేతన్ గాబ్రియల్ నూతన కమిటీని అభినందించి శు భాకాంక్షలు తెలియజేశారు.

ఎస్సై శామ్యూల్ రాజీవ్ కుమార్ బాధ్యతలు

విశాలాంధ్ర-రెంటచింతల : ఎస్సైగా శామ్యూల్ రాజీవ్ కుమార్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన ప్రకాశం జిల్లా గిద్దలూరి వాసి. విజయవాడ లయోలా కళాశా లలో బీఏ ఇంగ్లీష్, వైజాగ్ ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లీష్ పూర్తి చేశారు. 2018లో ఎస్సైగా ఉద్యో గానికి ఎంపిక అయ్యారు. జిల్లాలో భట్టిప్రోలు, కొల్లూ రులో ఎస్సైగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. ఇక్కడ పనిచేసిన సయ్యద్ సమీర్ భాషా ఎస్‌బీకి బదిలీపై వెళ్లారు.

కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణ పనుల పరిశీలన

విశాలాంధ్ర-అమరావతి : నాబార్డు నిధులతో జిల్లా గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ వారి సహకారంతో 95 వేల బస్తాల నిల్వ సామర్థ్యం గల కోల్డ్ స్టోరేజీని రూ.9.75 కోట్లతో అమరావతి మండలంలోని 14వ మైలు-ఉంగుటూరు మధ్య నరుకుళ్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వారు నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ పనులను పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కోట హరిబాబు మట్లాడుతూ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని, చొరవ చూపి, నిధులు మంజూరు చేయించి, త్వరితగతిన కోల్డ్‌స్టోరేజ్‌ని పూర్తిచేస్తున్నందుకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు రైతులు ఆనందంతో కృతజ్ఞతలు తెలుపుతున్నారని అన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని మల్లాది గ్రామంలో రూ.15 లక్షల ఎంపీ నిధులతో నిర్మాణం చేపట్టనున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావులు ఆదివారం శంకుస్థాపన చేశారు. తమ కాలనీలో సామాజిక అవసరాలకు ప్రజలకు ఎక్కువగా ఉపయోగపడే కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేయడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెంపాజ్వాల లక్ష్మీనరశింహరావు, బి.హనుమంతరావు, కోట హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ప్రభుత్వాలు మారుతున్నా గిరిజన బ్రతు కుల్లో వెలుగులు నింపడంలో విఫలమయ్యాయని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని కావూరు గ్రామంలో గల ఏకలవ్య కాలనీలోని ఎస్టీ కమ్యూనిటీ హాల్ వద్ద ఎస్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా నాయక్ మాట్లా డుతూ ఆర్థిక సామాజిక, రాజకీయ రంగాలతోపాటు మరో నాలుగు అంశా లపైన ఐక్యరాజ్యసమితి తీర్మానం చేసి ఆయా రాష్ట్రాలకు పంపించినప్పటికీ అవి అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన దినోత్సవం రోజున సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు కాంప్లెక్స్‌లో గల మెడికల్ హాలులో ఈ నెల 9వ తేదీన సాయంత్రం 5 గంటలకు అంతర్జాతీయ గిరిజన దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించతలపెట్టామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంభ నాగేశ్వరరావు, కోశాధికారి బి.రాంబాబు నాయక్, కుంభ సాంబయ్య, మొగిలి కోటేశ్వరరావు, కుంభ నాగేశ్వరరావు, ఉయ్యాల వెంకటేశ్వరరావు, మురళి, సిద్దు, రవితో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రజా హక్కులు కాపాడలేని పాలకులు వైదొలగాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి

విశాలాంధ్ర-అమరావతి : ప్రజాస్వామ్య దేశంలో ప్రజా హక్కులు కాపాడలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైదొల గాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ.మారుతి వరప్రసాద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన అమరావతిలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పెదకూ రపాడు సీపీఐ నియోజకవర్గ సమితి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావే శానికి మండల కార్యదర్శి కారంపూడి చెన్నకేశవరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ మణిపూర్ మారణ రావణకాష్టంగా కాలుతూ ఉంటే కేంద్ర ప్రభుత్వం చలి కాచుకోవాలని చూస్తుందని విమ ర్శించారు. విభిన్న వర్గాల మధ్య చెలరేగిన మారణ హోమాన్ని ప్రధానమంత్రి గాని, కేంద్ర హోంమంత్రిగాని ఖండించకపోవడం సభ్యసమాజం సిగ్గుతో తలవంచుకునే విధంగా ఉందని అన్నారు. ప్రజాప్రయోజనాలను కార్పొ రేట్ శక్తులకు తాకట్టుపెట్టి దేశ సంపదను దోచిపెడుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రగతి పట్టని కేంద్ర ప్రభుత్వం... రాష్ట్ర అభివృద్ధి పట్టని ముఖ్యమంత్రి వ్యవహ రిస్తున్న తీరు క్షమించరానిదని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దటంలో మకుటం లేని మహారా జుగా జగన్‌మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. దేశ అభివృద్ధి కన్నా ఆదాని, అంబానీ అభివృద్ధే ముఖ్యంగా పాలన సాగిస్తున్న పాలక విధానాన్ని ఎండగ ట్టేందుకు మోదీ హటావ్ దేశ్ బచావో అనే నినాదంతో సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్సు యాత్రను జయప్రదం చేసే దాంట్లో సీపీఐ కార్యకర్తలు ప్రధాన భూమిక నిర్వహించాలని కోరారు. సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, కాసా రాంబాబు మాట్లాడుతూ దేశ ప్రజలకు పట్టెడన్నం పెట్టే రైతు అప్పుల బాధతో ఆత్మ హత్యలతో కృంగిపోతున్నా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కఠినత్వాన్ని ప్రదర్శిస్తున్న తీరును ఎండగట్టేందుకు సీపీఐ కార్యకర్తలు రైతాంగ సమస్యల పట్ల అవగాహనతో రైతాంగ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు సమా యత్తం కావాలని పిలుపునిచ్చారు. రైతాంగ హక్కుల పరి రక్షణతో పాటు తెలంగాణ ప్రభుత్వం రైతాంగానికి ఇస్తున్న రూ.10 వేలు రాష్ట్ర ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. 7న విజయవాడ నగరంలో జరుగు తున్న రైతు ధర్నాను జయప్రదం చేసేందుకు ఈ ప్రాంత రైతాంగాన్ని ధర్నాలో భాగస్వాములు చేసేందుకు కృషి చేయాలని కోరారు. దేశ సంపదను సృష్టించడంలో ప్రధాన భూమిక నిర్వహిస్తున్న కార్మిక రంగాన్ని నిర్వీ ర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రభుత్వ పరిశ్రమలు ప్రైవేటుపరం చేస్తూ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మిక జీవితాలపై విలయతాండవం చేస్తున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఈ నెల 9న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేసేందుకు ఈ ప్రాంత కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ముసు గోడు శ్రీనివాసరావు మాట్లాడుతూ గత సమావేశం నుంచి ఈ సమావేశం వరకు జరిగిన కార్యకలాపాలపై రిపోర్టు ఇచ్చారు. భవిష్యత్తు కార్యక్రమాలపై ప్రతిఒక్కరూ దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని, గ్రామీణ ప్రాంతా ల్లో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి సీపీఐ కార్యకర్త కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ, మంత్రా లు, రమేష్, అంజి, గోపి, రాజు, జోజి, రాంబాబు, ఉదయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు కీలకం: కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు చాలా కీలకమని, ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని అధికారులకు కలెక్టర్ శివశంకర్ లోతేటి సూచిం చారు. ఓటర్ల జాబితాను సన్నద్ధం చేయడంలో ఎక్కడా ఆరోపణలు, అవకతవకలకు తావులేకుండా పని చేయాలని ఆదేశించారు. అన్ని రాజకీయ పార్టీల వినతులను పరిగణలోకి తీసుకొని ఓటర్ల జాబితాను సన్నద్ధం చేయాలని సూచించారు. పల్నాడు జిల్లాలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన స్పెషల్ సమ్మరీ రివిజన్-2024 సంక్షిప్త ఓటర్ల జాబితా సర్వే ప్రక్రియకు సంబంధించి జిల్లా కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో సమీక్షా సమావేశం జరిగింది. సంక్షిప్త ఓటర్ల జాబితా సర్వే జరుగుతున్న తీరును జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను జిల్లా అధికారులను అడిగి తెలుసుకొని, అందుకు తగిన విధంగా తీసుకోవల్సిన చర్యలపై దిశా నిర్దేశనం చేశారు. రాజకీయ పార్టీల సహకారంతో ఎక్కడా ఆరోపణలు లేకుండా అందరి సహకారంతో మెరుగైన ఓటర్ల జాబితాను సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సర్వే జరుగుతున్న క్రమంలో రాజకీయ పార్టీలకు చెందిన పోలింగ్ బూత్ లెవల్ ఏజెంట్ల సమక్షంలో వచ్చే ఇబ్బందులను అధిగమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, జిల్లాకు చెందిన ఈ.ఆర్.ఓ లు, ఏ. ఏ.ఈ.ఆర్.ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మృతి తీరని లోటు : మారుతి

విశాలాంధ్ర-నరసరావుపేట: ప్రజా కళాకారుడు, విప్లవ గాయకుడు గద్దర్ మృతి విప్లవోద్యమానికి తీరని లోటని జిల్లా సీపీఐ కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్ అన్నారు. సీపీఐ సమితి తరుపున గద్దర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియ జేస్తున్నామన్నారు. సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా కళాకారునిగా ప్రజల కోసం గళం విప్పిన వీరుని కోల్పోవడం తీరనిలోటని, ప్రజా సమస్యలపై ఉన్నతమైన ప్రజా గేయాలను పాడిన ఒక అమర గాయకునిగా గద్దర్ పేరు చిరకాలం నిలిచిపోతుందని కొనియాడారు. వామపక్ష శ్రేణులను తన గాత్రంతో ఉత్సాహపరుస్తూ ప్రజలను ఉత్తేజపరుస్తూ సాయుధ పోరాటాలకు సన్నద్ధం చేసిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర వెలలేనిదన్నారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా సమితి ఆయనకు ఘనంగా జోహార్లు అర్పించింది. ఆయనకు నివాళులర్పించిన వారిలో సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు మునుగోటి శ్రీనివాసరావు ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి బైరా పట్నం రామకృష్ణ, వైదన వెంకట్, ఉప్పలపాటి రంగయ్య, ప్రజానాట్యమండలి కళాకారుడు షేక్ చినజాను సైదా తదితరులు ఆయన మృతికి తీవ్ర సంతాపాన్ని తెలిపారు.

గద్దర్ మృతి జీర్ణించుకోలేనిది..

విశాలాంధ్ర-అమరావతి : ప్రజా గాయకుడు విప్లవ కెరటం ప్రజా ఉద్యమ యుద్దనౌక గద్దర్ మరణం జీర్ణించుకోలేనిదని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా సమితి ప్రధాన కార్యదర్శి భైరాపట్నం రామకృష్ణ, సీపీఐ పెదకూరపాడు నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావులు ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. ఆయన పాట, ఆట నిధి లాంటిదన్నారు. కొద్దికాలంలోనే గద్దర్‌ని, సాయి చంద్‌ను కోల్పోవడం దురదృష్టకరమని అన్నారు. గద్దర్ మృతికి సంతాపాన్ని ఆయన కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

గద్దర్ మృతి బహుజన ఉద్యమాలకు తీరనిలోటు

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ప్రజాకవి, గాయకుడు గద్దర్ మృతి దళిత, బహుజన ఉద్యమాలకు తీరని లోటు అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గద్దం పాల్ విజయ కుమార్ ఒక ప్రకటనలో అన్నారు. కారంచేడు, చుండూరు గ్రామాలలో దళితులపై జరిగిన మారణకాండకు వ్యతిరేకంగా జరిగిన దళిత మహాసభ ఉద్యమానికి అండగా నిలిచి దళిత ఉద్యమానికి జీవంపోసిన ప్రజాయుద్ధ నౌక గద్దర్ మృతి పీడిత ప్రజలకు తీరని లోటన్నారు. ఒక సామాన్య మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన గుమ్మడి విఠల్ రావు గద్దర్‌గా సుప్రసిద్ధుడై, జీవితాంతం ప్రజా సమస్య లపై అలుపెరగని పోరాటం చేస్తూ ప్రజాకవిగా, ప్రజా గాయకుడిగా కోట్లాది మంది ప్రజలను చైతన్యపరచిన సామాజిక ఉద్యమకారుడు అని కొనియాడారు. నవతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రావు సుబ్రమణ్యం గద్దర్ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి సామాజిక విప్లవాలకు తీరని లోటని, ఆయనతో తెలంగాణా ఉద్యమ సమయంలో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

గద్దర్ మృతి తీరని లోటు

విశాలాంధ్ర-గురజాల: విప్లవ పార్టీ కార్యకర్త, రచయిత, విప్లవ గాయకుడు గద్దర్ మృతి తీరని లోటు అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన గద్దర్ పాత్ర ఎన్నో ఉద్యమాలలో కొనియాడదగినది అని, ఉద్యమాలలో ఎన్నో ఆటుపోట్లను గెలుపు ఓటములను చవిచూసిన గద్దర్ మృతికి సంతాపం తెలియజేస్తూ ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని సీపీఐ నాయకుడు హుస్సేన్‌తో పాటు నేషనల్ నవక్రాంతి పార్టీ వ్యవస్థాపకులు కనకం శ్రీనివాసరావు కోరారు.

గద్దర్ మృతి బాధాకరం

విశాలాంధ్ర-మాచర్ల: ప్రజా గాయకుడు, ప్రముఖ విప్లవకారుడు గద్దర్ మృతి బాధాకరమని సీపీఐ మాచర్ల ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. పీపుల్స్ వార్, మావోయిస్టు ఉద్యమ పార్టీలలో ఆయన గళాన్ని పాటల రూపంలో వినిపించాడని, అంతేకాకుండా తెలం గాణ ఉద్యమంలో ఆయన కీలక పాత్ర పోషించాడన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ అశంపై చేసిన దీక్షలో గద్దర్ తనకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమిం పజేసిన సన్నివేశం ఎప్పటికీ మర్చిపోలేనిదన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరా లని కోరుకుంటూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

డాక్టర్ సారికకు 'ఉమెన్ ఐకాన్ అవార్డ్'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వీఎల్‌సీసీ హెల్త్ కేర్ లిమిటెడ్ గుంటూరు బిజినెస్ పార్ట్‌నర్ డాక్టర్ సారిక 2023 సంవత్సరానికి 'ఉమెన్ ఐకాన్ అవార్డ్ దక్కించు కున్నారు. విజయవాడ మురళీ ఫార్చ్యూన్ హోటల్లో ఆదివారం ఏషియన్ బిజినెస్ కార్పొరేషన్ ఇండియన్ ఉమెన్ సమ్మిట్ అవార్డ్స్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న వారికి గుర్తుగా ఈ అవార్డు అందజేస్తారు. ఇందులో భాగంగానే కాస్మోటిక్ ట్రీట్‌మెంట్ ద్వారా అందరి ఆదరాభిమానాలు అందుకుంటున్న డాక్టర్ సారికను ఎంపిక చేసి ఈ అవార్డ్‌ను ప్రదానం చేశారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-పొన్నూరు : ములుకుదురులో శనివారం ఓసి అంగన్వాడి కేంద్రం వద్ద పౌష్టికాహార కిట్లను ఎమ్మెల్యే కిలారి రోశయ్య లబ్ధిదారులకు అందించారు. 11 రకాల పౌష్టికాహారాన్ని ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని, వీటిని గర్భిణీలు, బాలింతలు విధిగా వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కార్మికవర్గాల మహాధర్నా విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించటానికి కార్మిక, ఉద్యోగ, కర్షకులు, అన్ని వర్గాల ప్రజలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని వామపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 9వ తేదీన విజయవాడలో నిర్వహించే కార్మిక సంఘాల మహా ధర్నా విజయవంతం చేయాలని కాంక్షిస్తూ వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వురు నాయకులు మాట్లాడుతూ కార్మికులు, ప్రజల అసంతృప్తిని పక్కదారి పట్టించటానికి మోదీ ప్రభుత్వం మతాల వారీగా ప్రజలను నిట్టనిలువునా చీలుస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే మణిపూర్, హర్యానాలో అల్లర్లు కొనసాగుతున్నా యని ఆరోపించారు. మైనార్టీలు, దళితులు, గిరిజ నులు, మహిళలు, ఇతర సామాజిక తరగతులపై సంఘపరివారం నిత్యం దాడులు చేస్తోందని, అదాని, అంబాని వంటి కార్పొరేట్ సంస్థలకు సేవ చేయటానికి ప్రజల మధ్య మోదీ ప్రభుత్వం చిచ్చుపెడుతుందని మణిపూర్ ఉదంతం తెలియజేస్తోందన్నారు. ఈ ప్రభుత్వం కొనసాగితే కార్మికులు బానిసలౌతారని, ఉద్యోగాల్లో పెట్టుకో వటం, తీసివేయటం యజమానుల ఇష్టారాజ్యం అవుతుందన్నారు. జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు ప్రతా పరెడ్డి మాట్లాడుతూ మోదీ ప్రజా వ్యతిరేక విధానా లను వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తూ ప్రజలపై తీవ్రమైన భారాలు వేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బా యమ్మ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, సీఐటీయూ మండల కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు పేలూరి రామారావు, ఏఐటీయూసీ, సీఐ టీయసీ నాయకులు గాత్రం భగత్‌సింగ్, స్థాలిన్, విల్సన్, బొంతా భగత్‌సింగ్, మూసాబోయిన వెంకటే శ్వర్లు, గాత్రం నాగయ్య, చెంచయ్య, ఆవుల పోతు రాజు, నాయుడు శివకుమార్ పాల్గొన్నారు.

యువగళం పాదయాత్ర జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పెదకూరపాడు: టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ బాబు యువగళం పాదయాత్ర నియోజకవర్గంలో ఈ నెల 9,10,11,12 తేదీలలో జరుగుతున్న సంద ర్భంగా పాదయాత్రను జయప్రదం చేయాలని మండల అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్ పిలుపుని చ్చారు. పాదయాత్ర జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం లింగంగుంట్ల, పొడ పాడు, ముస్సాపురం, పాటిబండ్ల గ్రామాలలో ఆయా గ్రామ కమిటీల ముఖ్య నాయకులతో కమిటీ ఏర్పాటు చేశారు. గల్లా బాబురావు, భాష్యం ఆంజనేయులు, బెల్లంకొండ గోపా లరావు, వడ్లమూడి అప్పారావు, మాజీ ఎంపీపీ పాడిబండ్ల శివమ్మ శివయ్య, బాలిరెడ్డి మస్తాన్ , షరీఫ్, మస్తాన్వలి, మిలిటరీ మౌలాలి, మక్కెన సాగర్ తదితరులు పాల్గొన్నారు.

దైదలో యరపతినేని పూజలు

విశాలాంధ్ర-గురజాల: ఆగస్టు 8వ తేదీన గురజాల నియోజకవర్గంలో జరగబోయే తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతం కావాలని గురజాల మండలం దైద అమరలింగేశ్వర స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీను, సీనియర్ నాయకులు పులుకూరి కాంతారావు, పొత్తూరి శివనాగు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యాసామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర-రెంటచింతల : పేద విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించేలా పరాశక్తి యాజమాన్యం కృషి చేస్తుందని పరాశక్తి సిమెంట్ పరిశ్రమ మేనేజరు ఎంఎస్ రాజు అన్నారు. మండలంలోని జెట్టిపాలెం, గోలి, పశర్లపాడు, మల్లవరం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 850 మంది విద్యార్థులకు రూ.2.20 లక్షల విలువైన రాతపుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్ళు, ఆట వస్తువులను పంపిణీ చేశారు. పరాశక్తి యాజమాన్యం ప్రతి ఏటా లక్షలాది రూపాయలు వెచ్చించి విద్యాపై మక్కువతో అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పరాశక్తి అధికారులు రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్, వెంకట్రావు, సర్పంచ్లు దావులారి ఉదయకుమారి, రమేష్, మున్నా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అల్లుడు చేతిలో అత్త హతం

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని 75 తాళ్లూరులో గ్రామానికి చెందిన షేక్ చాంద్ బి(48) తన కుమార్తె షకీలాను ఎనిమిది సంవత్సరాల క్రితం గుంటూరు రామిరెడ్డితోటకు చెందిన షేక్ మాబు సుభానికి ఇచ్చి వివాహం జరిపించింది. మాబు సుభాని ద్విచక్ర వాహనాల మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అత్త షేక్ చాందిబి పేరిట ఉన్న 2.16 ఎకరాల వ్యవసాయ భూమి, 11 సెంట్లు నివేసన స్థలాన్ని తమకు చెందకుండా తన మేనకోడలు సైదాబీకి పెడుతుందేమో అన్న అనుమానంతో అల్లుడు మాబు సుభానికి అత్త కుటుంబంతో కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. ఆస్తి తీసుకురావాలంటూ వేధింపులకు పాల్పడుతుండటంతో నెలరోజులు క్రితం భార్య షకీల పుట్టింటికి వచ్చింది. శనివారం భార్యను కాపురానికి పంపించాలని, ఆస్తి తన పేరిటకు మార్చాలంటూ అత్త చాంద్‌బితో అల్లుడు వాదనకు దిగాడు. ఆదివారం తెల్లవారుజామున మరో మారు సుభాని గొడవకు దిగాడు. ఈ నేపథ్యంలో అత్త తలపై గడ్డపారతో మోది హత్య చేసి పోలీసుల వద్ద లొంగిపోయాడు. సీఐ వీరాస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకట్రావు, ఏఎస్ఐ నాయక్, కానిస్టేబుల్ మురళి ఉన్నారు.

యువగళానికి ఘనస్వాగతం

విశాలాంధ్ర-కారంపూడి: నారా లోకేష్ యువగళ పాదయాత్రకు మాచర్ల నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ఆదివారం ఘనస్వాగతం పలికారు. మాచర్ల నియోజకవర్గ సరిహద్దు ప్రాంతంమైన కారంపూడి మండలం శ్రీచక్రసిమెంట్ ఫ్యాక్టరీ వద్ద నియోజకవర్గంలోకి పాదయాత్ర ప్రవేశించింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదురవెళ్లి ఆహ్వానం పలికారు. లోకేష్‌కు బ్రహ్మానందరెడ్డి గజమాలతో సత్కరించారు. మహిళలు పసుపు నీళ్ల బిందెలతో స్వాగతం పలికారు.

వెంకటేశ్వరస్వామి సేవకు బీసీలు అర్హులు కాదా ?

విశాలాంధ్ర - నకరికల్లు : వైకాపా ప్రభుత్వంలో బీసీలు టీటీడీ ఛైర్మన్‌గా వేంకటేశ్వరస్వామికి సేవ చేసుకునే అవకాశం కల్పించకపోవడం బాధాకర మని, బీసీలని కాదని తన సొంత సామాజిక వర్గా నికి చెందిన భూమన కరుణాకర్‌రెడ్డిని నియమించి దేవుని సేవకి బీసీలు అనర్హులు అనే విధంగా వీరిని ప్రకటించడం చాలా బాధాకరమని బీసీ సంక్షేమ సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు యామా మురళి అన్నారు. గత నాలు గేళ్ళు తన సామాజిక వర్గానికి చెందిన వైవీ సుబ్బారెడ్డి ఆఖరి సంవత్సరం అయినా బీసీలకు వస్తుందని ఆశతో ఎదురుచూసిన బీసీల ఆశలు అడియాసలు చేశారన్నారు. అదే విధంగా సామాజిక అంశంలో గడిచిన 60 రోజుల్లో సుమారుగా బీసీలపై ఎనిమిది చోట్ల బీసీలపై దాడులు చేసి బీసీలను సామాజికంగా అణగదొక్కాలనే ప్రయత్నం చేస్తున్నటువంటి పరిస్థితి నెలకొందన్నారు. ఈ వైకాపా ప్రభుత్వం బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్లు కోత విధించడం తిరుమలకు నూతనంగా వచ్చిన అర్చకులకు అధికమొత్తం జీతాలు, సన్నిధి గొల్లకు తక్కువ మొత్తంలో జీతం ఇవ్వడం కూడా బీసీలను వివక్షకు గురి చేయడమేనని యామా మురళి తెలిపారు.

విద్యా సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర-రెంటచింతల: పేద విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించేలా పరాశక్తి యాజమాన్యం కృషి చేస్తుందని పరాశక్తి సిమెంట్ పరిశ్రమ మేనేజరు ఎంఎస్ రాజు అన్నారు. మండలంలోని జెట్టిపాలెం, గోలి, పశర్లపాడు, మల్లవరం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 850 మంది విద్యార్థులకు రెండు లక్షల ఇరవై వేల రూపాయల విలువైన రాతపుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్ళు, ఆట వస్తువులను పంపిణీ చేసారు. పరాశక్తి యాజమాన్యం ప్రతి ఏటా లక్షలాది రూపాయలు వెచ్చించి విద్యాపై మక్కువతో అందజేస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పరాశక్తి అధికారులు ఎం.రామకృష్ణారెడ్డి, జి.చంద్రశేఖర్, వెంకట్రావు, సర్పంచ్‌లు దావులారి ఉదయకుమారి రమేష్, మున్నా చంద్రశేఖర్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

యువగళం జయప్రదం చేయండి

విశాలాంధ్ర-గురజాల: నియోజకవర్గంలో ఈ నెల 8వ తేదీన జరిగే యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు డా.చల్లగుండ్ల శ్రీనివాసరావు కోరారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ యువగళం పాదయాత్ర మంగళవారం గురజాల నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుంది అని, నియోజవర్గంలో జరగబోయే నారా లోకేష్ యువగళం పాదయాత్రకు అందరూ సిద్ధమవ్వాలని, యువగళం పాదయాత్రను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. యువగళం పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలు తెలుసుకుంటూ ముందుకు సాగుతున్న యువనాయకుడు నారా లోకేష్ గురజాల నియోజకవర్గంలోకి ప్రవేశించే ముందు టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై ఘన స్వాగతం పలకాలని, వేలాది సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొని పిడుగురాళ్లలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

ఆసిస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసరాల పంపిణీ

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ అసిస్ట్, సీడ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సుభాని నగర్‌లోని ఒంటరి నిరుపేద మహిళలైన 300 మందికి రూ.6 లక్షల విలువైన నిత్యావసరాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా అసిస్ట్ డైరెక్టర్ జాష్టి రంగారావు మాట్లాడుతూ ఒంటరి పేద మహిళలు ఇబ్బందులుపడకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని పేర్కొన్నారు. నిరుపేదలకు చేస్తున్న సాయం మనసుకు సంతృప్తినిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీడ్ సంస్థ తరఫున అస్మా, కమాల్, అబ్దుల్లా, అసిస్ట్ డైరెక్టర్ రంగారావు, ఆపరేషనల్ డైరెక్టర్ జాష్టి కృష్ణ హరీష్, మూర్తి, విష్ణు ప్రియ, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

జనగళమైన 'యువగళం'

విశాలాంధ్ర-బొల్లాపల్లి : యువగళం పేరుతో తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర కార్యక్రమం ఆదివారం వినుకొండ నియోజకవర్గంలోని బొల్లాపల్లి మండలం జయంతి రామ పురం గ్రామానికి చేరుకుంది. గ్రామం నుంచి ప్రారం భమైన పాదయాత్రకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో ఎదురేగి స్వాగతం పలికారు. అనంతరం జయంతి రామపురం గ్రామస్తులు యువనేత నారా లోకేష్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. వినతిపత్రంలో గ్రామంలో ఎదు ర్కొంటున్న తాగునీటి సమస్యలను గూర్చి, వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న జయంతి రామపురం గ్రామానికి నీటి సౌకర్యం లేకుండా పోవడంతో తాగునీటికి, సాగు నీటికి దశాబ్దాలుగా కష్టాలు ఎదుర్కోక తప్పడం లేదని అన్నారు. గ్రామమంతా భూగర్భ జలాలపైన ఆధారపడి జీవిస్తున్నటు వంటి కొన్నే ళ్లుగా భూగర్భ జలాలు కూడా అడుగంటి పోయాయని అన్నారు. దీనికి తోడుగా ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామంగా ఉన్నందున వయసులోనే అనారోగ్యం పాలవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలకు నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని గతంలో పేదలకు మంజూరు చేసిన అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలని చుక్కల భూములను క్రమబద్ధీకరించి హక్కులు కల్పించాలని ఈ మేరకు లోకేష్‌కు విన్నవించారు. అనంతరం మేళ్లవాగు గ్రామానికి చేరుకున్న నారా లోకేష్‌కు ఆ గ్రామస్తులు సైతం సమస్యలతో ముందుకు వచ్చారు. ఎక్కువ భాగం గిరిజన తండాలు కలిగి ఉన్న ఈ గ్రామంలో తండా నుంచి రవాణా మార్గం లేకపోవడంతో విద్యార్థుల చదువుకు ఆటంకం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను విన్న నారా లోకేష్ బాబు స్పందిస్తూ గ్రామీణ గిరిజన ప్రాంత ప్రజల సమస్యల సంపూర్ణ పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సాగర్ కాలువలను ఆధునీకరణ చేపట్టి చివరి భూముల వరకు సాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారం కోసం వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని అన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

విశాలాంధ్ర - వేటపాలెం : వేటపాలెం ఎస్సై జి సురేష్ ఆదేశాల మేరకు ఏఎస్సై డి.సామ్యూల్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని ప్రధాన కూడళ్లలో ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహ నాలు నడిపే వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. వాహనములు నడిపే వారు తీసుకోవలసిన జాగ్రత్తలుపై పలు సూచనలు తెలియచేశారు.త్రిబుల్ రైడింగ్ చేయకూడదని,ఆటోలలో ఎక్కువ మందిని ఎక్కించరాదని,తల్లిదండ్రులు చిన్న పిల్లలకు వాహనములు ఇవ్వరాదని,నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని వాహనదారులను ఆయన హెచ్చరించారు.

మోపిదేవిని సత్కరించిన సూరగాని దంపతులు

విశాలాంధ్ర -చీరాల : నాలుగు దశాబ్దాలుగా ప్రజా సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషించి బీసీ సామాజిక వర్గంలో తిరుగు లేని నాయకులుగా ఎదిగిన మోపిదేవి భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీసీ సేన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, వైసీపీ కౌన్సిలర్ సూరగాని లక్ష్మి,నరసింహారావు అన్నారు. రాజ్యసభ సభ్యులు జిల్లా వైఎస్ఆర్సిపి ఇన్చార్జి మోపిదేవి వెంకటరమణరావు జన్మదినోత్సవం సందర్భంగా సూరగాని దంపతులు ఆదివారం ఉదయం రేపల్లెలోని ఆయన స్వగృహంకు చేరుకొని మర్యాదపూర్వకంగా కలసి పూలబొకే అందజేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి జీడిపప్పు మాలతో మోపిదేవి దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి వైఎస్ఆర్సిపి నాయకులు వారే చంద్రశేఖర్ రెడ్డి,యన్ సూర్యచంద్ర,ఆర్ టి జీఎస్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో ప్రాజెక్టులు నిర్వీర్యం

చీరాల నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి ఎంఎం కొండయ్య

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రంలో ఉన్న నీటి పారుదల ప్రాజెక్టులు నిర్వీర్యమయ్యాయని చీరాల నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి ఎంఎం కొండయ్య అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గుండ్లకమ్మ ప్రాజెక్టును సందర్శించి ఏ విధంగా వైకాపా పాలనలో నిర్వీర్యం చేస్తున్నది ప్రజలకు అవగాహన కల్పించడం కోసం తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు అనంతరం నిర్వహించే బహిరంగ సభకు చీరాల నుండి అధిక సంఖ్యలో తెదేపా శ్రేణులు తరలి వెళ్లాయి. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు ఈ వైకాపా ప్రభుత్వ పరిపాలనలో ఇబ్బందులు పడుతున్నారు అని అన్నారు. రైతులు సాగునీటి కోసం, ప్రజలు తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొండయ్య ఆధ్వర్యంలో వివిధ వాహనాల్లో తెదేపా నాయకులు, కార్యకర్తలు, మహిళలు తరలి వెళ్లారు.

సమర్థమైన విధి నిర్వహణ ద్వారా గుర్తింపు

విశాలాంధ్ర-చీరాల రూరల్ : విధి నిర్వహణలో సమర్ధ వంతంగా సేవలు అందించడం ద్వారా మంచి గుర్తింపు వస్తుందని చీరాల మండలం ఈ ఓపీఆర్ అండ్ ఆర్‌డీ,దేవాంగపురి పంచాయితీ కార్యదర్శి బందారు మురళీ బాపూజీ అన్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా పోస్టు మ్యాన్‌గా పనిచేస్తున్న శంకరరెడ్డిని శ్రీ స్వామి వివేకానంద అసోసియేషన్ తరపున అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ మాట్లాడుతూ విధి నిర్వహణలో బాధ్యతా యుతంగా పని చేస్తే ప్రజల మన్ననలు పొందవచ్చు అని అన్నారు. పూలమాలలు వేసి నూతన వస్త్రాలతో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

విశాలాంధ్ర - కర్లపాలెం : ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982-83, 1983-84బ్యాచ్‌ల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరలో విజయవాడ సెంటిని హాస్పటల్ డాక్టర్లు కార్డియాలజిస్ట్ కిరణ్,డాక్టర్ శ్రీపతి 250 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పుంగనూరు దాడులకు నిరసనగా చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం

విశాలాంధ్ర-చీరాల : పుంగనూరులో రూట్ మ్యాప్ లేకపోయినా దౌర్జన్యంగా ప్రవేశించిన చంద్రబాబు నాయుడు నాయుడు పోలీసులను ఉద్దేశించి తరిమి కొట్టండి నాకొడుకుల్ని అని మాట్లాడి దాడులకు ప్రేరేపించాడని బాధ్యతయుత ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు ప్రశాంతంగా ఉన్న సీమలో రక్తపాతం సృష్టించారని ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. ఆదివారం పుంగనూరు ఘటనలో చంద్రబాబు వైఖరికి నిరసనగా చీరాలగడియార స్తంభం సెంటర్లో ఎమ్మెల్సీ పోతుల సునీత ఆధ్వర్యంలో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ నాలబై ఏళ్ల రాజకీయ జీవితంలో చంద్రబాబు ప్రజలకు చేసిందేమీ లేక పుంగనూరులో అమాయకులైన కార్యకర్తల ను పోలీసులపైకి రెచ్చగొట్టి దాడులు జరిపించారని అన్నారు. రాష్ట్రంలో ఎన్ని అరాచకాలు సృష్టించిన రాబోయే ఎన్నికల్లో వైస్సార్సీపీ గెలుపు ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లెల బుల్లిబాబు,దాసరి రూప,దాసి పీటర్ రమేష్,గుమ్మడి రత్నప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలకు నిరసన ర్యాలీ

విశాలాంధ్ర-పర్చూరు: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ... ఆదివారం స్థానిక అంబేద్కర్ నగర్ వాసులు నిరసన ర్యాలీ నిర్వహిం చారు. అలాంటి ఘటనలు జరగకుండ కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నిరసనకారులు తెలిపారు. ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించారు.

రైల్వే స్టేషన్‌కు రూ.25.6 కోట్లతో ఆధునిక హంగులు

వర్చువల్ విధానంలో ప్రధాని మోదీ శంకుస్థాపన

విశాలాంధ్ర-రేపల్లె : అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకంలో భాగంగా రేపల్లె రైల్వే స్టేషన్ ఆధునీకికరణకు రూ.25.6 కోట్ల నిధులు మంజూరు అయినట్లు రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి మేరుగా నాగార్జున తెలిపారు. ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో చేసిన శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. మంత్రి మేరుగా నాగార్జున మాట్లాడుతూ అమృత భారత్ పథకంలో భాగంగా, రేపల్లె రైల్వే స్టేషన్ ఆధునీకరణ, అభివృద్ధి, రైలు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టటం అభినందనీయం అన్నారు. అమృత్ భారత్ పథకం ద్వారా గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని రేపల్లె, పిడుగురాళ్ల, దొనకొండ స్టేషన్ల రూపురేఖలు మారనున్నట్లు చెప్పారు. ప్రపంచ స్థాయి ఆధునిక సౌకర్యాలు ప్రయాణీకులకు అందుబాటులోకి రానున్నాయని వివరించారు. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని తీర ప్రాంత చివరి రైల్వే స్టేషన్ రేపల్లె అభివృద్ధికి నిధులు ఏర్పాటు చెయ్యటం హర్షణీయం అన్నారు. వేమూరు నియోజకవర్గ పరిధిలోని భట్టిప్రోలు, వేమూరు స్టేషన్ల మధ్య ట్రక్ ను పరిశీలించి వీలైతే ఆస్టేషన్ లను కూడా అభివృద్ధి చెయ్యాలని కోరారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ రావు మాట్లాడుతూ రేపల్లె మారుమూల ప్రాంతం కావటం, రవాణాకు అనుకూలమైన నెలలు ఈ ప్రాం తంలో లేకపోయినా కేంద్ర ప్రభుత్వం అభివృద్ధికి నిధులు మంజూరు చేయటాన్ని స్వాగతిస్తున్న మని అన్నారు. అయితే అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతులు చేసే స్థాయి రేపల్లెకు ఉందన్నారు. ఆక్వా, మెరైన్ ఉత్పత్తుల లో కాకినాడ, విశాఖపట్నం తరువాత స్థానం నిజాంపట్నంకు చెందుతుందని అన్నారు. మరో ప్రక్క వాణిజ్య పంటలైన పసుపు, అరటి, కంద, ఉత్పత్తులు ఇతర రాష్ట్రాలకు ఇక్కడ నుండి ఎగుమతులు జరుగుతాయని చెప్పారు. 1916లో చిన్న స్టేషన్ గా బ్రిటీష్ వారు ప్రారంభించిన రేపల్లె రైల్వే స్టేషన్ అంచలంచలుగా అభివృద్ధి చెందిందన్నారు. ప్రయాణీకులకు మాత్రమే కాకుండా వాణిజ్య పంటల ఎగుమతులను చేసేందుకు వీలుగా 2011లో మచిలీపట్నం, రేపల్లె, నిజాంపట్నం మీదుగా బాపట్ల వరకు నూతన రైల్వే లైన్ నిర్మాణం చేపట్టేందుకు సర్వే పనులు కూడా పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఒంగోలు నుండి కత్తిపూడి వరకు నిర్మించిన 216 ఏ జాతీయ రహదారి వలన మద్రాస్ నుండి కలకత్తా రవాణా చాలా అనుకూలంగా ఉందన్నారు. అదే క్రమంలో కేంద్ర ప్రభుత్వం మచిలీపట్నం బాపట్లకు నూతన రైలు మార్గం నిర్మిస్తే ఈ ప్రాంతం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. అనంతరం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి మేరుగా నాగార్జున ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లిఖార్జున రావు, గుంటూరు అడిషనల్ రైల్వే మేనేజర్ సైమన్, చైర్ పర్సన్ కట్టా మంగ, బిజెపి జిల్లా అధ్యక్షులు రామారావు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

మోదీని గద్దె దింపాలంటూ బైకు ర్యాలీ

విశాలాంధ్ర-చీరాల : క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర కార్మిక సంఘాలు స్వతంత్ర సంఘాలు ఫెడరేషన్లు కలిసి మోదీని గద్దె దింపేందుకు దేశాన్ని కాపాడేందుకు కృషి చేయాలని ఏఐటీయుసి జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు. ఆగస్టు 9న విజయ వాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని చీరాల పట్టణంలో ఏఐటీయుసి ఆధ్వర్యంలో నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీ కరించడం బిజెపి ప్రభుత్వం మానుకోవాలని 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని అన్నారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని అన్నారు. అసంఘటితన రంగ కార్మికులు,హమాలీ ముఠా కార్మికులకు పని భద్రత కల్పించాలని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులు పటిష్టంగా అమలుపరిచి పెండింగ్ క్లెయిమ్ లు పరిష్క రించాలని అన్నారు. స్కీమ్ వర్కర్ల జీతాలు పెంచాలని పెండింగ్ నెల జీతాలు వెంటనే విడుదల చేయాలని కార్మికులకు సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని అన్నారు. దేశ్ బచావో మోడీ హటావో సేవ్ పబ్లిక్ సెక్టార్ సేవ్ డెమోక్రసీ అంటూ నినాదాలు చేస్తూ పట్నంలో ర్యాలీ నిర్వహించారు. పొదిలి శ్రీమన్నారాయణ,డి వెంకటేశ్వరరెడ్డి, చిరుమల ప్రకాష్,కె పాల్,కుంచాల వెంకటేశ్వర్లు షేక్ సుభాని, సివిల్ సప్లైస్ యూనియన్ నాయకులు రమణ,వెంకట రమణ,బాసి పైడయ్యా, అప్పన్న, కృష్ణ, శ్రీను, సుబ్బారెడ్డి, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మాల్యాద్రి, ఏబు,వందనం ప్రసాద్, శీను పాల్గొన్నారు.

చుండూరు అమరవీరులకు ఘన నివాళులు

విశాలాంధ్ర- బాపట్ల టౌన్ : ఆధిపత్య కుల అహంకారానికి హత్యకాబడిన చుండూరు దళిత అమర వీరులకు బాపట్ల దళిత సంఘాల నాయకులు ఘన నివాళురల్పించారు. అంబేద్కర్ భవన్ లో చుండూరు మృతవీరులకు దళిత నేతలు నివాళురల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.చార్వాక మాట్లాడుతూ చుండూరు అగ్రవర్ణ దాడి జరిగిన నేటికట 32 ఏళ్లు గడించిందన్నారు. చుండూరు మృతుల కుటుంబాలు నేటికి జీవితాలు అస్తవ్యస్తంగా కొనసాగుతున్నాయన్నారు. కేసులలో దోషులకు సరిగ్గా శిక్షలు కూడా విధించలేని పరిస్థితుల్లో అగ్రవర్ణ ప్రభుత్వాలు కొనసాగుతున్నాయన్నారు. అందరూ నిర్దోషులైతే చుండూరులోని దళిత యువకులను హత్య చేసిన నీచులు ఎవరని ప్రశ్నించారు. ప్రభుత్వాలకు రానున్న కాలంలో దళిత బహుజన ప్రజలు ఏకమై బుద్ధి చెప్పాలని కోరారు. దళిత యువకులు అన్ని రంగాల్లో ముందున్నారనే దాడులు చేయడం, పలువురిని హత్య చేయడం జరిగిదంన్నారు. దళితుల విషయంలో అన్ని అగ్రవర్ణ పార్టీల వైఖరి ఒకటే అని విమర్శించారు. దళిత వీరుల త్యాగాలు ఊరికే పోవని , దళిత సంఘాలు, దళిత పార్టీలు అన్ని ఏకమై ఈ బూర్జువా ప్రభుత్వాలను ఏనాటికైనా కూల్చడం తధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల సీనియర్ నాయకులు కోటేశ్వరరావు, వినయ్ రాజు, శీలం రోజన్ బాబు, మేకల ప్రసాద్, పి. సి సాయిబాబు, పర్రె కోటయ్య, విజయ్ కుమార్, గుదే రాజారావు,దాసరి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

జనసేన టార్గెట్ 50 వేల మంది కార్యకర్తలు

- చీరాలలో ప్రభంజనం సృష్టించేందుకు సిద్ధమవ్వాలి
- జనసేన నేత ఆమంచి స్వాములు

విశాలాంధ్ర-చీరాల : చీరాల నియోజకవర్గంలో 50 వేలకు పైగా జనసేన కార్యకర్తలను తయారు చేసేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని,అణచివేత అధికమైతే తిరుగుబాటు తప్పదనిజనసేన నాయకులు ఆమంచి వెంకటేశ్వర్లు అలియాస్ స్వాములు పిలుపునిచ్చారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చిత్రపటానికి జనసేన నాయకులు గూడూరు శివరామప్రసాద్ పాలాభిషేకం చేస్తుంటే అది సహించలేని కొందరు గలాట సృష్టించి అడ్డుకున్నారని అయితే రాబోయే రోజుల్లో కొన్ని వేల మందితో అదే గడియార స్తంభం సెంటర్లో భారీ బహిరంగ సభ నిర్వహించి పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తామన్నారు. ఆదివారం చీరాల రవి షాపింగ్ మాల్ వెనుకనున్న గుండపు వెంకయ్యతయారమ్మ ఆనందమయా కళ్యాణమండపంలో జనసేన జిల్లా నాయకులు అల్లా అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆమంచి వెంకటేశ్వర్లు అలియాస్ స్వాములు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆమంచి వెంకటేశ్వర్లు అలియాస్ స్వాములు మాట్లాడుతూరాబోయే ఎన్నికల్లో కులమతాలకు అతీతంగా జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు.

మహిళా సాధికారతే టీడీపీ ఆశయం

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మహిళా సాధికారతే తెలుగుదేశం పార్టీ ఆశయం అని మండల తెలుగుమహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానెట్ సౌపాటి, టీడీపీ మండల అధ్యక్షులు మహమ్మద్ ఆఫ్జాల్ అన్నారు. ఇటీవల జరిగిన పార్టీ పండుగ మహానాడులో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీ మనిఫెస్టోలో మహిళల కోసం ప్రకటించిన మహాశక్తి పథకం గురించి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ వేగేశన నరేంద్రవర్మ ఆదేశంతో ఆదివారం పిట్టువారిపాలెం గ్రామంలో తెలుగు మహిళా నాయకులు ఇంటింటికి పర్యటించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో మహిళభ్యుదయం జరిగిందని,మహిళా సాధికారత సాధిస్తే సమాజానికి మేలని,మహిళలకు ఏవిధంగా లబ్ది చేకూరుతుందనేది వివరిస్తూ ఈసారి తెలుగుదేశం పార్టీకి విజయానికి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాయిబాబా రెడ్డి, క్లస్టర్ ఇంచార్జి శంకరరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు శివాజిరెడ్డి చక్రధరరెడ్డి, తెలుగుమహిళ కమిటీ సభ్యులు రాజ్యలక్ష్మి, సరోజిని, ఝాన్సీ, భవనంవారిపాలెం గ్రామ తెలుగుదేశం పార్టీ మహిళా నాయకులు బాల సీతమహాలక్ష్మి, పిట్టు లక్ష్మి తిరుపతమ్మ, పిట్టు విజయకుమారి, కుంచల శివమ్మ, బాల సాంబ్రాజ్యం, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఎంపీ జన్మదినోత్సవంలో భారీ ర్యాలీ

విశాలాంధ్ర - నిజాంపట్నం : రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపీ మోపిదేవి సోదరుడు మోపిదేవి హరనాథ్ బాబు ఆధ్వర్యంలో నిజాంపట్నం నుండి రేపల్లెకు భారీగా ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలలో భారీ ర్యాలీగా తరలివెళ్లారు. నిజాంపట్నం బస్టాండ్ సెంటర్లో కేక్‌ను కట్ చేశారు. జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య,ఎంపీటీసీ నాజర్ ఖాన్, వైస్ ఎంపీపీ ఉన్నవ చంటి,పల్లవసేన జిల్లా అధ్యక్షుడు మోపిదేవి శివనాగరాజు, కన్నా భూశంకర్, పల్సర్ నాగరాజు, కన్నా వెంకట ప్రసాద్, మహమ్మద్ గౌస్, షేక్ అన్వర్, వైసీపీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు ఉన్నారు.

గద్దర్‌కు ప్రజా సంఘాల ఘన నివాళి

విశాలాంధ్ర-బాపట్ల టౌన్ : ప్రజా యుద్దనౌక తన గాత్రంలో చైతన్యవంతులను చేసిన గద్దర్ (75) మృతి చెందటం అత్యంత భాదకరమని అంటరానితన నిర్మూలన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జి. చార్వాక అన్నారు. బాపట్ల పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళురల్పించారు. ఈ సందర్భంగా చార్వాక మాట్లాడుతూ ప్రజా యుద్ధనౌకగా పేరొందిన గద్దర్ పీపుల్స్ వార్,మావోయిస్టు, తెలంగాణ ఉద్యమాల్లో తన గళంతో కోట్ల మంది ప్రజలను ఉత్తేజపరిచారన్నారు. గద్దర్ అసలు పేరు గుమ్మడి విఠల్ రావు అని జన నాట్యమండలి వ్యవస్థాపకుల్లో గద్దర్ కూడా ఒకరు అన్నారు.

రాజకీయాలకతీతంగా ప్రజాసేవకే ప్రాధాన్యం

- టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి

విశాలాంధ్ర-మార్టూరు : రాజకీయాలకతీతంగా ప్రజా సేవ కు ప్రాధాన్యత నిస్తున్నానని, సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తానని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం ఇంకొల్లు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్లో ఏలూరి నాగేశ్వరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రమేష్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా నియోజకవర్గ ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు 2050 పైగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా కంటి వైద్య శిబిరాలు, మోకాళ్ళ ఆపరేషన్లకు ప్రాధాన్యమించమన్నారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో అలాంటి రాజకీయాలకు తావు లేకుండా నిర్వహిస్తున్నామన్నారు. ప్రకాశం జిల్లా వ్యవసాయ ఆధారిత జిల్లా అని, ప్రజలు ప్రధానంగా రెండు సమస్యలతో వ్యాధుల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ప్రధానంగా... పౌష్టికాఆహారం లోపం వల్ల, ఫ్లోరైడ్ నీటి సమస్య వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. వీటికి తోడు రసాయన మందులు వల్ల, కరోనా తర్వాత శ్వాస కోస వ్యాధుల సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. వ్యాధులను మొదటి దశలో గుర్తించకపోవడం వల్ల తీవ్ర పరిణామాలు ఎదురవుతున్నాయని,వీటిని అధిగమించేందుకు, వ్యాధులను తొలి దశలో గుర్తించేందుకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగ పడుతాయన్నారు. ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తొలిదశలోనే వ్యాధులను గుర్తించి చికిత్సలు పొందాలన్నారు. ప్రముఖ వైద్యులతో రమేష్ హాస్పిటల్ ఈ క్యాంపులో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ క్యాంపులో ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ జగదీష్ పాల్గొన్నారు. డాక్టర్ కార్తీక్ చౌదరి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్డియాలజీ, న్యూరాలజి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, యూరాలాజి, పల్మనాలజి, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, ప్రత్యేక అంటు వ్యాధుల వైద్య నిపుణులు ఈ వైద్య శిబిరం నందు పాల్గొని కొన్ని ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

- ఉచిత మల్టీ సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

ఎమ్మెల్యే ఏలూరి సారధ్యంలో ఇంకొల్లులో నిర్వహించిన ఉచిత మల్టీ సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఉదయం 7 గంటల నుంచే ప్రజలు క్యాంపుకు బారులు తీరారు. వచ్చిన వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించారు. ఈ క్యాంపు నియోజకవర్గం వ్యాప్తంగా 2419 మంది హాజరు హాజరయ్యారు. క్యాంపుకు హాజరైన ప్రతి ఒక్కరికి బీపీ షుగర్ రక్తపరీక్షలు నిర్వహించారు. గుండె సంబంధిత వ్యాధులు ఉన్న వారికి 200 మందికి ఈసీజీ, 53 మందికి ఎకో, 80 మందికి పల్మనాలజి, 300 ఆర్థోపెడిక్ పరీక్షలు నిర్వహించారు. 32 మందికి మోకాళ్లు ఆపరేషన్ రిఫర్ చేశారు. అనేకమందికి రాయితీ పై వైద్యం అందించేందుకు రాయితీ కార్డ్స్ అందజేశారు.

- అన్నదానం

ఉచిత మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరంలో ఎమ్మెల్యే ఏలూరి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్యాంపుకు వచ్చిన ఇలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక కౌంటర్ ద్వారా అందరికీ భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, షేక్ శంషుద్దీన్, పోద వీరయ్య , సీనియర్ నాయకులు తొండపు ఆదినారాయణ పాల్గొన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

చంద్రబాబు పర్యటనలో వేగేశన

విశాలాంధ్ర-బాపట్ల : వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులపై జరుగుతున్న విధ్వంసంపై రైతులకు వివరించేందుకు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు చేపట్టిన యుద్ధభేరి గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్దకు బాబు ఆదివారం వచ్చారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ చంద్రబాబుతో పాటు పాల్గొని ప్రాజెక్టును పరిశీలించారు. రైతును రాజును చేస్తానని హామీ ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం సాగునీరు సకాలంలో అందించలేని పరిస్థితుల్లో ఉందన్నారు. రాబోవు రోజుల్లో ప్రజలంతా సాగనంపేందుకు సిద్దంగా ఉన్నారన్నారు. చంద్రబాబు పర్యటనకు వస్తున్న ప్రజాధరణ చూసి వైసీపీ నేతల వెన్నులో వణుకు మొదలైందన్నారు.

ఆధునిక జీవితంలో జీవిత బీమా అవసరం

విశాలాంధ్ర-చీరాల : ఆధునిక జీవన శైలిలో మానవ జీవితం సుఖంగా గడపాలంటే మనిషికి కూడు గూడు గుడ్డ మాత్రమే కాకుండా నాలుగో అవసరం జీవిత బీమా అని సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీ నారాయణ అన్నారు.వరంగల్‌లో ఆదివారం నిర్వహించిన ఫాస్ట్‌ట్రాక్ ఎండీ,ఆర్టీ సేవా సంస్థ శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో జూలై నెలకి గాను ఫాస్ట్‌ట్రాక్ ఎండీఆర్టీ సేవా సంస్థ నిర్వహించిన ఉత్తమ బీమా ఏజెంట్‌ల పోటీలో విజయం సాధించిన ఏజెంట్‌లకి సన్మానం ప్రశంసా పత్రాలను అందించారు. ప్రకాశం,బాపట్ల జిల్లాలలో బీమా ఏజెంట్‌లలో ప్రప్రధముడిగా నిలిచి పేరు తెచ్చిన పాత ప్రకాశం జిల్లా,నేటి బాపట్ల జిల్లా లోని చీరాలకి చెందిన ప్రముఖ ఏజెంట్ దివ్వెల మురళి కృష్ణని సత్కరించి మరెన్నో విజయాలు సాధించాలన్నారు.

పథకాలు మావి.. పెత్తనం వారిదా..

- అమృత్ భారత్ ప్రోగ్రాంలో ఆగ్రహించిన బీజేపీ నేతలు

విశాలాంధ్ర-రేపల్లె : ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన అమృత్ భారత్ స్టేషన్ అభివృద్ధి వర్చువల్ శంకుస్థాపన కార్యక్రమంలో పట్టణ బీజేపీ నాయకులకు చేదు అనుభవం ఎదురైంది. రైల్వే శాఖ అధికారులు రెండు రోజుల ముందు పట్టణ బీజేపీ నేతలు ఆహ్వాన పత్రికలు అందజేశారు. రేపల్లె రైల్వే స్టేషన్ ఆధునీకికరణకు కేంద్ర ప్రభుత్వం రూ.25.6 కోట్ల నిధులు మంజూరు చేయటంతో బీజేపీ శ్రేణుల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ మేరకు బీజేపీ బాపట్ల జిల్లా అధ్యక్షులు మువ్వల వెంకట రమణారావు, పట్టణ పార్టీ నాయకులు స్టేషన్ ఆవరణంలోనికి వచ్చారు. మోదీ నాయకత్వం వర్ధిల్లాలని, నినాదాలు చేశారు. అయితే రైల్వే స్టేషన్లలో ఏర్పాటుచేసిన స్టేజి వద్దకుగానీ, వీఐపీ గ్యాలరీలోనికిగాని బీజేపీ నేతలను వెళ్ళ నీయకుండా రైల్వే పోలీసులు వారిని ఆపారు. ఈ లోపు మంత్రి మేరుగా నాగార్జున, పట్టణ వైసీపీ నేతలు రావటంతో రైల్వే అధికారులు వారిని స్టేజి మీదకు పిలిచారు. అంతా వైసీపీ వారు కావటం బీజేపీ జిల్లా అధ్యక్షుడిని కూడా స్టేజి పైకి పిలవక పోవటంతో ఆగ్రహించిన బీజేపీ నేతలు పథకాలు మావి పెత్తనం వైసీపీ వారిదా అంటూ రైల్వే అధికారులతో వాగ్వాదానికి దిగారు. కొందరు బీజేపీ నేతలు మమ్ములను అవమానించారని అక్కడ నుండి బయటకు వెళ్లిపోయారు. పరిస్థితి గమనించిన స్థానిక పోలీసులు నచ్చచెప్పటంతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మువ్వల వెంకట రమణ రావుని స్టేజి పైకి ఆహ్వానించారు.

వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలపై జాగ్రత్త

విశాలాంధ్ర-చీరాల : వృద్ధాప్యంలో వచ్చే ఆరోగ్య సమస్యల పట్ల శ్రద్ధవహించి, తరచు అవసరమైన ఆరోగ్య పరీక్షలను చేయించుకోవాలని చీరాల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుభాషిణి అన్నారు. ఆదివారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో ఆరోగ్య సదస్సును ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుభాషిణి మాట్లాడుతూ వయస్సు పైబడిన వారందరూ ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలని, ప్రతిరోజు ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా వాకింగ్, చిన్నచిన్న వ్యాయామాలు చేయాలని సూచించారు. చీరాల ఏరియా ఆసుపత్రిలోఅన్ని విభాగాలకు సంబంధించిన వైద్యులను ప్రభుత్వం నియమించిందని, ఆరోగ్య పరీక్షలు చేయడానికి అవసరమైన నూతన పరికరాలు అందుబాటులోఉన్నాయని అన్నారు. ఆసుపత్రిలో అందించే వైద్యసేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వృద్ధులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎస్ యల్లమందారెడ్డి,కట్టా రాజీ వినయ్ కుమార్, ఎ.నాగవీరభద్రాచారి, రామారావు,శివప్రసాద్, నారాయణరావు, జగన్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలించాలి

విశాలాంధ్ర-పర్చూరు: బూత్‌స్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలించాలని వైసీపీ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ తెలిపారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆదివారం ఇంకొల్లు, మార్టూరు మండలాలలోని బూత్‌స్థాయి ఏజంట్లతో సమావేశం నిర్వహించారు. ఆమంచి మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న మృతులను గుర్తించి తొలిగించాలని, 18 ఏళ్ళు నిండిన యువతి యువకులకు ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దొంగ ఓట్లను గుర్తించి తొలిగించాలని ఆమంచి సూచించారు. సమావేశంలో ఏజంట్లు, వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

పంచాయతీ వార్డులకు ఎన్నికలు

విశాలాంధ్ర - బాపట్ల : నియోజకవర్గంలోని బాపట్ల మండలం జిల్లెల్లమూడి 6 వ వార్డు, కర్లపాలెం మండలంలోని పేరలిపాడు- 10వ వార్డు, బుద్దాం - 6వ వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణకు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈనెల 8వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. పదో తేదీ నుంచి నామినేషన్లు స్వీకరణ, 11వ తేదీ నామినేషన్ల పరిశీలన, 12వ తేదీ అభ్యంతరాల స్వీకరణ, 13వ తేదీ అభ్యంతరాల పరిశీలన, 14వ తేదీ నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు ప్రకటన, 19వ తేదీన ఎన్నికలు అదే రోజు లెక్కింపు జరుగుతుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.